



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

## ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలి

**ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్**

దంతాలపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండి, విద్యార్థులకు సేవలందించాలని పభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం ఆయన దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు బీరిశెట్టిగూడెం, నిదానపురంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దంతాలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు.. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. దేశ భవిష్యత్ వారిపైనే ఆధారపడి ఉందన్నారు. విద్యార్థి తరగతి గదిలో క్రమశిక్షణతో మెలిగినప్పుడే బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తాడన్నారు. నిదానపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. బీరిశెట్టిగూడెంలో అంగన్‌వాడి కేంద్రాన్ని ప్రారంభించి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోన్న సన్నబియ్యంపై ఆరాతీసి నిరుపేద కుటుంబానికి చెందిన వారితో కలిసి భోజనం చేశారు. కుట్టుశిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీదేవి, తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, హెచ్‌ఎం వేణుమాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

### భిన్నత్వంలో ఏకత్వానికి రాజ్యాంగం నిదర్శనం

డోర్నకల్ (ఆంధ్రజ్యోతి) : దేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా రాజ్యాంగం నిలిచిందని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అన్నారు. ముల్కలపల్లిలో 'జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో రాజ్యాంగాన్ని రక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డోర్నకల్ మండలంలో ప్రతి ఎస్సీ కాలనీ, తండాలలో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు జగదీష్, నాయకులు బత్తుల శ్రీనివాస్, జవ్వాజి రాంప్రసాద్, కాసం శేఖర్, హరికృష్ణ, తాల్లూరి హనుమ, గోపాల్ పాల్గొన్నారు.




హనుమకొండ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల ఆకస్మిక బదిలీ యత్నాలు కలకలం రేపుతున్నాయి. ములుగు జిల్లా మినహా వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లిలో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసేందుకు ఆయా జిల్లాల యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నట్టు వస్తున్న వార్తలు ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వాస్తవానికి 8 నెలల కిందటే జీవో నెంబరు 80 ప్రకారం ప్రస్తుతం కార్యదర్శుల్లో 40 శాతం మందిని బదిలీ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ ఆదేశాలు లేకుండా ఎలాంటి బదిలీలు చేయరాదు. పైగా రాష్ట్రంలో బదిలీలపై నిషేధం అమలులో ఉండగా ఎలా బదిలీలు చేస్తారని కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శుల బదిలీలు అంతా మౌఖికంగానే జరుగుతున్నాయని సమాచారం. కాగా ఈ బదిలీలపై జిల్లా పంచాయతీ అధికారులు మౌనం పాటిస్తున్నారు.

# మాట.. చేటు.. వేటు..!

## ఉమ్మడి జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు రంగం సిద్ధం?

- 8నెలలకే రెండోసారి ట్రాన్స్‌ఫర్లకు కసరత్తు
- అయోమయంలో ఐదు జిల్లాల కార్యదర్శులు
- నియోజకవర్గాల వారీగా చేయడంపై చర్చ
- బదిలీ యత్నాల వెనుక రాజకీయ కోణం
- ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికే కారణమా?
- ఇన్‌చార్జ్ మంత్రిపై ఎమ్మెల్యేల ఒత్తిడి ఫలితం
- నిబంధనలకు వ్యతిరేకమంటున్న ఉద్యోగులు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొదలైన ఆందోళనలు
- కలెక్టర్లను కలిసి వినతిపత్రాల అందజేత



### రాజీయ ఒత్తిళ్లేనా?

పంచాయతీ కార్యదర్శులను ఆకస్మిక బదిలీ కసరత్తు వెనుక రాజకీయ కోణం ఉన్నట్టు భావిస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ మాటలను కార్యదర్శులు వినడం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి మొరపెట్టుకోగా ఆయన ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు అధికారులు బదిలీలు చేపడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కొద్ది నెలలుగా కార్యదర్శుల బదిలీపై ఎమ్మెల్యేలు ఇన్‌చార్జ్ మంత్రిపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో మంత్రి ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు బదిలీ చేయాల్సిన కార్యదర్శుల జాబితాను జిల్లా యంత్రాంగాలు సిద్ధం చేసినట్టు సమాచారం.

### ఇందిరమ్మ ఇళ్లే కారణమా?

పంచాయతీ కార్యదర్శులను ఆగమేఘాల మీద బదిలీ చేయాలన్న ఒత్తిళ్లు రావడం వెనుక ఇందిరమ్మ ఇళ్లే కారణమని తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇందుకు కార్యదర్శులే కారణమని ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు భావించినట్టు తెలుస్తోంది. 2004-2014 మధ్య రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ పార్టీయే ఉంది. ఆ సమయంలో చాలా మంది కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులుగా అవతారమెత్తి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పెద్దమొత్తంలో డబ్బులు దండుకున్నారు. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారుల ఎంపికలో గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను మినహాయించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు కార్యదర్శులు వారి పేర్లేవి రాకుండా జాబితాలు తయారు చేశారు. దీంతో వీరంతా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి కార్యదర్శులే కావాలని తమ పేర్లను చేర్చలేదని ఫిర్యాదులు చేశారు. దీనికితోడు గ్రామాల్లో అర్హులైన చాలా మంది పేర్లు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చోటు చేసుకోలేదు. ఒక ఇంటిలో తల్లిదండ్రులతో పాటు కొడుకులు నివాసముంటున్నప్పుడు తండ్రి పేరును ఇంటి యజమానిగా పేర్కొని కొడుకులకు సొంత ఇల్లు లేవు కనుక వారు అద్దెకున్నట్టు కార్యదర్శులు పేర్కొన్నప్పటికీ వారి పేర్లేవి ఇందిరమ్మ జాబితాలో చోటు చేసుకోలేదు. ఇందుకు కార్యదర్శులు బాధ్యులు కానప్పటికీ తమ పేర్లు లేకపోవడానికి వారే కారణమంటూ ఎమ్మెల్యేలకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. తాము చెప్పినట్టు కార్యదర్శులు నడుచుకోవడం లేదన్న కోపంతో ఎమ్మెల్యేలు వారిని ఏకంగా తమ నియోజకవర్గంలోనే ఉండకుండా ఇలా బదిలీలకు ప్లాన్ చేసినట్టు సమాచారం.

### అయోమయం

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే

మిగతా 7వ పేజీలో



పెద్దవంగరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యశస్వినిరెడ్డి

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి**

పెద్దవంగర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. సోమవారం పెద్దవంగరలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చిట్యాలలో రావుల వెంకటరంగారెడ్డి తన సొంత ఖర్చులతో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించామని, క్రయవిక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సన్నరకానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారన్నారు.

అలాగే పాలకుర్తి మండలంలోని వల్మిడి సీతారామచంద్రయ్య ఆలయంలో కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో ప్రమాదవశాత్తు టెంట్ కూలడంతో గంట్లకుంట గ్రామానికి చెందిన పాయాలి సంధ్య గాయాలు కావడంతో అమెను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తొర్రూరు ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, తహసీల్దార్ మహేందర్, ఏవో స్వామినాయక్, ఏపీఎం రమణాచారి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, జాటోత్ నెహ్రూనాయక్, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మురళి, శ్రీనివాస్, వెంకన్న, శ్యామ్, ముత్యాలపూర్ణచందర్, గోపాల్, రవీందర్‌రెడ్డి, లింగమూర్తి, వేణు, రాజుయాదవ్, సోమన్న, యాకన్న, ఉప్పలయ్య, సతీష్, మహేష్, సైదులు, సమ్మయ్య వినోద్ పాల్గొన్నారు.



## గాలివాన బీభత్సం

- నారాయణపురంలో వడగళ్ల వర్షానికి వరి పంటకు నష్టం
- గాలికి ఎగిరిపోయిన ఇళ్లకప్పులు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం



కేసముద్రం మండలం నారాయణపురం పీక్లాతండాలో పడిన వడగళ్లను చూపుతున్న మహిళ



ధన్నసరి రేకులతండాలో గాలికి ఎగిరిపోయిన ఇంటిపైకప్పు

కేసముద్రం, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా వచ్చిన గాలివాన బీభత్సం సృష్టించింది. నారాయణపురం పరిసర తండాలైన పీక్లా, వనాలకుంట, క్యాంపుతండాల్లో వడగళ్లవానతో వరి పొలాలకు భారీగా నష్టం వాటిల్లినట్లు తండావాసులు తెలిపారు. అరఅడుగు మందంతో వడగళ్లవాన పడడంతో వరి పొలాల్లో పొట్టకొచ్చిన వరి గింజలు రాలిపోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. కేసముద్రం, ధన్నసరి, బేరువాడ, మహమూద్ పట్నం తదితర గ్రామాల్లో ఇళ్లపైనున్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. ధన్నసరి రేకులతండాలో బానోత్ సక్కల్వలలో చుక్క సోమయ్య ఇళ్లపైకప్పులు రేకులు పూర్తిగా ఎగిరిపోయాయి. లక్ష్మీనగర్, హన్మంతరావుకాలనీ, తదితర చోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. కేసముద్రం-మహబూబాబాద్ రోడ్డు మార్గంలో చెట్లకొమ్మలు విరిగిపడినట్లు సమాచారం అందింది.

నెల్లికుదురు (ఆంధ్రజ్యోతి) : మండలంలో గాలివాన అతులాకుతలం చేసింది. దీంతో చెట్లకు ఉన్న మామిడి కాయలు రాలిపోయాయి. వడగండ్ల వానకు పోలాల్లోని వడ్లు రాలిపోయాయి. కొన్ని చోట్ల వరికుప్పలు వర్షానికి తడిశాయి. మొత్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు.

## పేదోడి ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం

**మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్**



అనంతారంలో సన్నబియ్యంతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి) : పేదోడి ఆకలిని తీర్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారనిమహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. మానుకోట మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డు అనంతారంలో గార్లపాటి శ్రీనివాస్-మంగమ్మ ఇంట్లో ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ నాయకులు కంకర అయ్యప్పరెడ్డి గ్రామస్థులతో కలిసి సోమవారం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఉచిత సన్నబియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యంఅందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలు ఆకలితో బాధపడకుండా పౌష్టికాహారం పొందాలన్నదే ఈ పథకం యొక్క ముఖ్యఉద్దేశమని చెప్పారు. సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, సాయి, మాజీ వార్డు కౌన్సిలర్ కోడినాగమణిశ్రీనివాస్, జిలుగుల భాస్కర్‌యాదవ్, నూనావత్ రాజేష్‌నాయక్, చంటి పాల్గొన్నారు.

### వైద్యులు సమయపాలన పాటించాలి

వైద్యులు సమయ పాలన పాటించి, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సోమవారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. అనంతరం అస్పత్రిలోని వార్డులు కాలినడకన తిరిగి పరిశీలించారు. నిర్వహణ, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రజలకు సేవ చేయాల్సిన వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వోకు ఫోన్ చేసి డ్యూటీకి గైర్హాజరైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాటే విధంగా ప్రభుత్వ వైద్య సిబ్బంది వ్యవహరించడం సరికాదన్నారు. సమయానికి విధులకు హాజరు కావడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని చెప్పారు. బాధ్యత రహితంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. మందుల సరఫరా, శానిటేషన్‌ను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాకుల వేంకటేశ్వరుడి ఆలయం

# మహిమాన్వితుడు.. మాకుల వేంకటేశ్వరుడు

**నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు**



మాకుల వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగా, పద్మావతి సమేత దేవతామూర్తుల మూలవిరాట్ విగ్రహాలు

- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- 12న కల్యాణం, 26న పారువేట
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



మాకుల జాతరకు వచ్చి చెట్లకింద సేదతీరుతున్న భక్తులు (ఫైల్)

మరిపెడ, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కోరీన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు మాకుల వేంకటేశ్వరస్వామి. అలివేలు మంగ-పద్మావతి సమేత నిత్యపూజలు అందుకుంటున్న మాకుల వేంకటేశ్వర స్వామి ఆలయం చిన్న తిరుపతిగా వెలుగొందుతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు మరిపెడ మాకుల వెంకన్న బ్రహ్మోత్సవాలకు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలను చైత్రశుద్ధ ఏకాదశి నుంచి మొదలుకొని చైత్రశుద్ధ బహుళ త్రయోదశి వరకు ఆలయ నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 18రోజుల పాటు జరిగే ఇక్కడి జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి దర్శనం పొంది తరిస్తారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్స వాలు మంగళవారం సాయంత్రం తొళక్కంతో (అధ్యయనోత్సవ ప్రారంభం)తో ఘనంగా ప్రారంభిస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎండోమెంట్ అధికారులు అన్నిరకాల వసతులను ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు రానున్న వేలాదిమంది భక్తుల కోసం ఈనెల 8 నుంచి 26వ తేదీ వరకు నిత్యం అర్చకులు రోజుకొక్క తీరు హోమాలు, పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 12 రాత్రి వేంకటేశ్వరుడి కల్యాణం, 26న పారువేట వేడుకలు ఉటాయి. కల్యాణోత్సవానికి రామసహాయం సురేందర్‌రెడ్డి-జయమాల దంపతులు దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించడం అనవాయితీగా వస్తోంది.

మాకుల వేంకటేశ్వరుడి జాతరలో ఏప్రిల్ 26న జరిపే స్వామివారి పారువేట అత్యంత అమూల్యమైనది. లోకకల్యాణం కోసం అలివేలు మంగ-పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి అశ్వ వాహనంపై ఎరువేటకు వెళ్తారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు వేలాది మందిగా తరలివచ్చి స్వామివారిని దర్శనం చేసుకొని మొక్కులు చెల్లిస్తారు. మారెమ్మ తల్లికి జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించి బంధు మిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేసి హోరెత్తిన సంబరాల పరంపరంగా ఎంతో పరవశంతో మురిసిపోతారు.

### రవాణా సౌకర్యం

మాకుల వేంకటేశ్వరుడి ఆలయానికి మెరుగైన రవాణా సౌకర్యం ఉంది. వరంగల్-ఖమ్మం హైవేకు

మిగతా 8వ పేజీలో..

## ఎస్సారెస్పీ కాలువలో పడి నెల్లూరు వాసి మృతి



మల్లి ఏడుకొండలు మృతదేహం

దంతాలపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కెనాల్‌లో నీటమునిగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని శ్రీబాలాజీ ఫంక్షన్‌హాల్ శివారు డీబీఎం 60లో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై పిల్లల రాజు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా నర్సీపురానికి చెందిన మల్లి ఏడుకొండలు(25) అవివాహితుడు. తాపీమేస్త్రీగా నెల కిందట దంతాలపల్లి మండల కేంద్రానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం పని ముగించుకొని స్నానం చేయడానికి ఒంటరిగానే ఎస్సారెస్పీ కెనాల్ లోకి దిగాడు. కొద్ది సేపటికే ఆయన నీటమునిగి కెనాల్‌లో కొట్టుకుపోయాడు. ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి మృతి చెందిన ఏడుకొండలును సోమవారం బయటికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్సై రాజు తెలిపారు.

# ఏడాదిగా వేతనాల్లేవ్..

- ఇబ్బందులు పడుతున్న 'ధరణి' ఆపరేటర్లు
- నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో అయోమయం
- జీతాలు ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి



జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ధరణి ఆపరేటర్

కేసముద్రం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏ ఉద్యోగి అయినా తాను అందించే సేవలకు ప్రతిఫలంగా వేతనం పొందడం అతని హక్కు. తాను పనిచేస్తున్న సంస్థలో ఒక్కోసారి ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒకటి నుంచి ఆరు నెలల వరకు ఉద్యోగికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితులు ఉంటాయి. అలాంటిది ఏకంగా ఏడాది కాలంగా ప్రభుత్వ సంస్థలో వేతనాలు లేకుండా పనిచేస్తున్న దీనస్థితి 'ధరణి' ఆపరేటర్లది. మహబూబాబాద్ జిల్లాలో 2018, మే 23న అప్పటి 16 మండల తహసీల్దార్ కార్యాలయాల్లో 'ధరణి' ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటైన ఇనుగుర్తి, సీరోలు మండలాల్లోను ఈ రిజిస్ట్రేషన్ సేవలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 18 మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయభూముల క్రయవిక్రయాలు, బహుమతి, వారసత్వ బదిలీలు, తనఖా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. రోజుకు ఒక్కో కార్యాలయంలో సగటున 4 నుంచి 5 వరకు సుమారు 70 వరకు వివిధ రకాల రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ఇందుకోసం ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో ఒక ధరణి ఆపరేటర్‌ను ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వు 60 ప్రకారం వీరికి రూ.29వేలు చెల్లించాల్సి ఉండగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీద్వారా రూ.12వేల వేతనం చెల్లించారు. వీరిని ప్రతీ ఏడాది, రెండేళ్ల కొకసారి బదిలీ చేస్తూ వస్తున్నారు.

### సంస్థ మారడంతో ఏడాదిగా వేతనాల్లేవ్..

జిల్లాలో 18 మంది ధరణి ఆపరేటర్లకు చివరిసారిగా గత ఏడాది ఫిబ్రవరి నెలలో వేతనం వచ్చింది. ఆ తర్వాత మార్చి నెల నుంచి నేటి వరకు సరిగ్గా ఏడాది కాలంగా వేతనాలు ఇవ్వడం లేదు. గతంలో వేతనాలు ఇచ్చే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని గత ఏడాది జూలైలోనే ప్రభుత్వం తొలగించి ప్రభుత్వానికి చెందిన సాంకేతిక సంస్థ ద్వారా నేరుగా వేతనాలిచ్చేందుకు సిద్ధమైంది. దీంతో తమకు వేతనాలు ప్రభుత్వ జీవో ప్రకారం అధికంగా వస్తాయని ఆపరేటర్లు ఆశతో ఉండగా వారి ఆశలు అడియాశలయ్యాయి. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నుంచి ప్రభుత్వానికి వీరిని బదిలీ చేసినట్లుగా నియామక పత్రాలు ఏవీ ఇవ్వలేదని ఆపరేటర్లు చెబుతున్నారు. ప్రతీ నెల హాజరును మాత్రం సంబంధిత తహసీల్దార్ ధృవీకరణతో తెలంగాణ సాంకేతిక సేవల(టీజీటీఎస్) సంస్థకు పంపిస్తున్నారు. అయితే తమకు నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో తాము ఏ సంస్థ కింద పనిచేస్తున్నామనే విషయం తమకు అర్థం కావడం లేదని, తమ వేతనాలను ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆపరేటర్లు వాపోతున్నారు. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు ఆపరేటర్ల సంఘం బాధ్యులు తెలిపారు. ఏడాది కాలంగా వేతనాలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా తమకు వేతనాలు అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం..**

**ఐనాల ఉదయ్, ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ జిల్లా అధ్యక్షుడు**



ఏడాది కాలంగా రాష్ట్ర వ్యాప్తంగా ధరణి ఆపరేటర్లకు వేతనాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. పెరిగిన ధరలతో తమ స్వస్థలాల నుంచి పనిచేసే చోటుకు నిత్యం అప్ అండ్ డౌన్ చేసేందుకు ప్రయాణ, కుటుంబ నిర్వహణ ఖర్చులు అధికంగా అవుతున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు జీవో 60 ప్రకారం ప్రతీ నెల వేతనాలను అందించి ఆదుకోవాలి.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**వరంగల్ ఎంపీ కడియం కావ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

పెద్దవంగర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పేదల అభ్యున్నతికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో చేపట్టిన సేవలు అభినందనీయమని వరంగల్ ఎంపీ కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దవంగర మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ పెద్దవంగర భవన నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే వేరువేరుగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్యం, సామాజిక సేవ తదితర రంగాల్లో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని, పెద్దవంగరలో నూతన లయన్స్ క్లబ్ ఏర్పాటు చేయడం శుభసూచకమన్నారు. లయన్స్ క్లబ్‌తో పాటు మరికొంత మంది దాతలను చైతన్యపరిచి సమాజహితం కోసం సేవా కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలకు తమవంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. లయన్స్ క్లబ్ పెద్దవంగర అభివృద్ధి కోసం ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దవంగర లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్(సిరి), రేణుక, శ్రీనివాస్, ఎర్ర వెంకన్న, శ్రీనివాస్, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనరసింహరావు, రాజేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వెంకన్న, శారద, నాగవాణి, సరేష్ సోమ నర్సింహా రెడ్డి, వెంకటేశ్వర్లు, మధుసూదన్, ఉషయ్య, అమృత్‌రెడ్డి, రవి, సుభాష్, సతీష్ పాల్గొన్నారు.

## బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

**మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉద్యమించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని చంద్రుగూడెంలో సీసీరోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జైబాపు.. జైభీమ్, జైసంవిధాన్‌లో భాగంగార్యాలీ నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మురళీనాయక్ మాట్లాడారు.. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప..గడపకు తీసుకువెళ్లి లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేయాలన్నారు. వచ్చే జూన్ మాసంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని, ఆ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరేష్‌రెడ్డి, డివిజన్ నాయకుడు బోయినపల్లి సతీష్‌రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపాల్‌రెడ్డి, చంటిస్వామి, బొల్లికొండ మధు, యాకయ్య, ఆరైం వీరస్వామి, లక్ష్మయ్య, పద్మ, బాలు తదితరులు పాల్గొన్నారు.

# మామిడి తోటకు నిప్పు పెట్టిన దుండగులు

- రామకృష్ణాపూర్‌లో 2వేల మామిడి చెట్లు దగ్ధం
- రూ.30 లక్షల ఆస్తినష్టం



మండలంలోని రామకృష్ణాపూర్‌లో దగ్ధమైన మామిడితోట

వెంకటాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పంట చేతికొచ్చే దశలో మామిడి తోట అగ్నికి ఆహుతి అయింది. గుర్తు తెలియని వ్యక్తులు తోటకు ఒక మూలన నిప్పంటించడంతో మంటలు చెలరేగి మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగింది. బాధిత రైతు మొకిరాల తిరుపతిరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తనకున్న ఐదెకరాల్లో సుమారు 2వేలకు పైగా మామిడి చెట్లు నాటానని, ఉదయం 10గంటల సమయంలో మామిడితోట సమీపంలోకి కొంతమంది వ్యక్తులు వచ్చివెళ్లారని అన్నారు. కొద్దిసేపటికి వారు వచ్చిన ప్రదేశం నుంచి క్రమంగా మంటలు రావడం చూసి ఆర్పేందుకు గ్రామస్థులను సహాయంగా తీసుకుని వచ్చేందుకు వెళ్లగా అప్పటికే మంటల ఉధృతి పెరిగి పంట పూర్తిగా ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 2వేలకు పైగా చెట్లతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయని, సుమారు రూ.30లక్షల ఆస్తినష్టం సంభవించిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపారు. కాగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## ప్రజా ఆరోగ్యం పట్ల నిబద్ధతతో పనిచేయాలి

- మానుకోట డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ.. మానవ ఆరోగ్య హక్కును కాపాడేందుకు 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పడిందన్నారు. అందుకోసమే ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు ఆందోళనకరస్థాయిలో తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో మాతా శిశు సంరక్షణ అత్యంత ముఖ్యమైందన్నారు. ప్రజా ఆరోగ్యానికి మూలస్తంభం తల్లిబిడ్డల ఆరోగ్యమేనన్నారు. తల్లిబిడ్డల ఆరోగ్యంపై పెట్టుబడులు పెట్టడం,కుటుంబాలు, ప్రభుత్వాల నైతిక బాధ్యత అన్నారు. సమానసుస్థిర సుసంపన్న భవిష్యత్ నిర్మాణానికి,మానవజాతి మనుగడకు అత్యవసరమన్నారు. ఈ సమీక్షలో సారంగం, సుదీర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, ప్రమీల, విజయ్‌కుమార్, శ్రావణ్, కొప్పు ప్రసాద్, కెవి.రాజు, రామకృష్ణ, మంగమ్మ, నిలోహన, సౌమిత్ పాల్గొన్నారు.

## రవాణా భత్యం చెక్కులు అందజేత

నెల్లికుదురు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుదూర గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం ఆలేరు పాఠశాలలో ఎంఈవో రాందాస్ సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయ మాట్లాడుతూ బస్సుసౌకర్యం లేక ఆటోలో వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం రూ.6వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మే 4 వరకు పుష్కరాల పనులు పూర్తిచేయాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ**



కాళేశ్వరంలో పుష్కరాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న పుష్కరాల పనులన్నీ మే 4వ తేదీ వరకు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో కలెక్టర్ సోమవారం పర్యటించారు. పుష్కరాలకుజరిగే పనులను పరిశీలించారు. మొదటగా వీఐపీ ఘాట్ వద్ద జరుగుతున్న ర్యాంపు నిర్మాణం, సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న పనులు, శాశ్వత ప్రాతిపదికన జరుగుతున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. పుష్కర ఘాట్లలో స్నాన ఘట్టాలు, విద్యుత్ స్తంభాలఏర్పాటు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడారు. సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నాయని, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యమన్నారు. మరుగుదొడ్లు, స్నాన ఘట్టాలు, దుస్తులు మార్చుకునే గదులు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చేపట్టినపనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.

### పనులను అడ్డుకున్న భూ యజమానులు

గోదావరి పుష్కర ఘాట్ వద్ద పనులు నడుస్తుండగా ఆ పనులు చేయొద్దని, మాకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదని సంబంధిత భూయజమానులు అడ్డుకున్నారు. పనులను పరిశీలించడానికి వచ్చిన కలెక్టర్‌కు తమ గోడును వినిపించారు. 2015 నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి రాలేదని, మాకు తెలువకుండా పనులు చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా తమకు న్యాయం జరగడం లేదన్నారు. తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



స్పందన (ఫైల్)

మరిపెడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యార్థిని హైదరాబాద్‌లో తన తల్లి వద్ద ఉంటూ ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మరిపెడ మునిసిపల్ కేంద్రం సీతారాంపూర్ కాలనీకి చెందిన కొమ్ము పరుశరాములు-రాధ దంపతుల కుమార్తె స్పందన(18) ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. కుటుంబ కలహాలతో ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకొందని స్థానికులు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని మరిపెడ బంగ్లాకు తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపారు.

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెంది ఇతర దేశాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకంకు మే 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నరసింహస్వామి సోమవారం తెలిపారు.2025-26 విద్యాసంవత్సరం యుఎస్ఏ, యుకె, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, సౌత్ కొరియా, న్యూజిలాండ్ దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పోస్టుగ్రాడ్యుయేట్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువాలనుకుంటున్న ఎస్సీ విద్యార్థుల నుంచి తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంకు చెందిన ఎస్సీ వారై ఉండాలని, సంవత్సర ఆదాయం రూ.5 లక్షలకు మించి ఉండరాదని, పీజీ చదవటానికి గ్రాడ్యుయేషన్‌లో ఫస్ట్‌క్లాస్ మార్కులు వచ్చిఉండాలని, టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/జీఆర్‌ఈ/జీఎంఏటీ నందు అర్హత కలిగిఉండాలని, పాస్ పోర్టు నందు వీసా అర్హత కలిగిఉండాలని, విదేశీ విశ్వవిద్యాలయం నందు ప్రవేశం పొంది ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ పథకమునకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు వెబ్‌సైట్ www.telangana.epass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఆరోగ్య రక్షణకు పాటుపడాలి

తొర్రూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలు అన్ని చర్యలు తీసుకోవాలని తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు, మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఇది సొంతమైతే అంతకు మించిన సంపన్నులు ఉండరని తెలిపారు. వేసవిలో తప్పనిసరిగా 5లీటర్ల నీరు తాగాలని, దైనందిన జీవితంలో వ్యాయామం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు మీరజ్, జ్వలిత, ప్రియాంక, నందన, శంకర్, జయమణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులం.. కబ్జాదారుల నుంచి కాపాడండి

- అధికారుల ఆదేశాలు ధిక్కరించి పిల్లర్లు కూల్చేశారని ఆవేదన



వివాదాస్పద ఇంటి నిర్మాణం వద్ద వృద్ధ దంపతులు

చిన్నగూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కబ్జాదారుల నుంచి తమకు వారసత్వంగా వచ్చిన భూమిని కాపాడి తమకు న్యాయం చేయాలని చిన్నగూడూరుకు చెందిన వృద్ధ దంపతులు నీలం శంకరయ్య, నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. తనతో పాటు ముగ్గురు సోదరులకు వారసత్వంగా వచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్నామని, తాము ఆక్రమించామని దేవేందర్ చేసిన ఆరోపణలో వాస్తవం లేదన్నారు. 2023లో నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రదీప్ చంద్ర అనే వ్యక్తి అనుచరులు భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించి తమపై దాడి చేశారని వివరించారు. ఆ తర్వాత శాంతి భద్రతల దృష్ట్యా వివాదం పరిష్కారమయ్యేవరకు ఎవరు ఆ స్థలంలోకి వెళ్లకూడదని స్థానిక తహసీల్దార్ ఆదేశాల్విడంతో ఇంటి నిర్మాణం నిలిపేశామని తెలిపారు. కానీ దేవేందర్ అనే వ్యక్తి అధికారుల ఆదేశాలు ధిక్కరించి 4 తేదీ అర్ధరాత్రి పిల్లర్లు కూల్చివేసి, తానే పిల్లర్లను కూల్చివేశానని సంబంధిత అధికారుల ముందు అంగీకరించాడని, అయినా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటిస్థలంపై తహసీల్దార్, గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశామని, కొందరు అధికారులు ప్రదీప్, దేవేందర్‌తో చేతులు కలిపి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తమ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపించారు.

## యశ్వంత్‌ను ప్రశంసించిన సిక్కిం గవర్నర్

మరిపెడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన మౌంటెనర్ భూక్యా యశ్వంత్‌ను సిక్కిం గవర్నర్ ఓంప్రకాశ్ మాతుర్ అభినందించారు. సోమవారం ఆ రాష్ట్ర రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను యశ్వంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యశ్వంత్ దిగ్విజయంగా పూర్తిచేసిన వివిధ పర్వతారోహణల గురించి గవర్నర్‌కు వివరించి జ్ఞాపిక అందజేశారు. ఎవరెస్ట్ పర్వతారోహణగా ఎంచుకున్న లక్ష్యం వైపు అడుగులు వేస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గవర్నర్ ఆకాంక్షిస్తూ తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని చెప్పినట్లు యశ్వంత్ మరిపెడ విలేకరులకు తెలిపారు.



సిక్కిం గవర్నర్ ఓంప్రకాశ్ మాతుర్‌కు జ్ఞాపిక అందిస్తున్న మౌంటెనర్ యశ్వంత్

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | 2151 | 1521 |
| పల్లికాయ (సూక) | 6500 | 5200 |
| పల్లికాయ (పచ్చిది) | 4575 | 4200 |
| కందులు | 6829 | 3022 |
| పెసళ్లు | 7602 | 3022 |
| పత్తి | 7405 | 5300 |
| పసుపు (కాడి) | 12126 | 10534 |
| పసుపు (గోల) | 12009 | 9700 |
| తేజ మిర్చి | 12600 | 9500 |
| డిడి | - | - |
| వండర్‌హాట్ | 14800 | 10000 |
| ఎల్లో మిర్చి | - | - |
| యూఎస్341 | 11300 | 9000 |
| దేశీ | 28000 | 18000 |
| సింగిల్‌పట్టి | 26000 | 18500 |
| దీపిక | 13000 | 10000 |
| తాలు మిర్చి | 5000 | 2500 |

- వరంగల్ వ్యవసాయం

# అధునాతన నక్షత్రశాల.. అదిగదిగో..



పునరుద్ధరణకు ముందు శిథిలావస్థలో ఉన్న నక్షత్రశాల



పనులు పూర్తి చేసిన తర్వాత ప్లానిటోరియం ఉంటుందిలా (నమూనా)

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడో 43ఏళ్ల క్రితం వరంగల్‌లో నక్షత్రశాల (ప్లానిటోరియం) ఏర్పాటైంది. నాడు దేశంలో ఉన్న 12 ప్లానిటోరియాల్లో ఇదొక్కటి. హిందూజా ప్రతాపరుద్ర ప్లానిటోరియం పేరుతో 2004 వరకు ఖగోళంపై విజ్ఞానాన్ని పంచింది. ఎంతో మంది డైరెక్టర్లు సేవలందించారు. అలాంటి ప్లానిటోరియం ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరింది. పర్యవేక్షణ, నిర్వహణ లేక పరికరాలు తుప్పు పట్టాయి. దీంతో సుమారు 20ఏళ్లుగా ఓరుగల్లు వాసులకు ప్లానిటోరియం అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుతం ఆసక్తి ఉన్నవారంతా హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పాత ప్లానిటోరియం ఉన్న స్థానంలోనే అధునాతన హంగులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ప్లానిటోరియానికి రూపుదిద్దుతున్నారు.

## ఇక వరంగల్ నుంచే..

ఆకాశంలో జరుగుతున్న వింతలు విశేషాలను వరంగల్ ప్లానిటోరియం నుంచే చూడొచ్చు. విశ్వం పుట్టుక, పరిణామ క్రమం, భూమిపై ఏర్పడిన మానవ స్వరూపాల గుర్తించి క్షుణ్ణంగా తెలుసుకోవచ్చు. ఇతర గ్రహాల ప్రరిభ్రమణం.. వాటి పని తీరు... అక్కడి వాతావరణ పరిస్థితి.. ఒక్కో గ్రహం ప్రత్యేకత.. ఆయా గ్రహాల్లో జరిగే వింతలు వరంగల్ కేంద్రంగా చిన్న పిల్లల నుంచి పెద్ద వారు వయోబేధం లేకుండా వీక్షించవచ్చు. ఇకపై వరంగల్ నతక్షత్రశాలలో సూర్యకుటుంబంలో మిళితమై ఉన్న అంగారకుడు (మార్స్), బృహస్మతి (జూపిటర్), శుక్రుడు (వీనస్), భూమి(ఎర్త్), శని (సటర్న్), బుధుడు (మెర్క్యూరి), కేతువు (నెప్ట్యూన్), రాహువు (యురేనస్)లను అతి సమీపం నుంచి చూసే అవకాశం ఉంది. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సరికొత్త ప్లానిటోరియాన్ని అందుబాటులోకి తేనున్నారు. హైదరాబాద్ బిర్లా సైన్స్ మ్యూజియం తర్వాత అదే తరహాలో గతంలో ఉన్న నక్షత్రశాల ప్రదేశంలో కొత్త హంగులు, సాంకేతిక పరిజ్ఞానంతో ప్లానిటోరియాన్ని పునరుద్ధరణ చేస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్న క్రమంలోనే నక్షత్రశాల పనులను కూడా ముమ్మరంగా చేస్తున్నట్టు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. ఇక్కడి పనులను మేయర్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సదరు కాంట్రాక్టర్‌ను అప్రమత్తం చేస్తున్నారు.




ప్లానిటోరియం పనులు పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి (ఫైల్)

ఇప్పటికే రూ. 2 కోట్ల నిధులు ఖర్చు చేసి పాత భవనాన్ని రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారు. వరంగల్ నగరంలో చాలా కాలంగా నిలిచిపోయిన నక్షత్రశాలను పునఃప్రారంభించాలని ఇక్కడి ప్రజాప్రతినిధులు, బల్దియా అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా.. గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దాంతో వెంటనే కౌన్సిల్ తీర్మానం చేసి అనుకున్నదే తడవుగా మూడు నెలలుగా పనులను ముమ్మరంగా చేస్తున్నారు. సైన్స్, సాంకేతిక విద్య పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం అత్యాధునిక నక్షత్రశాలను పునఃప్రారంభించనున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర (ఫైల్)





| S.No | Name of the Director | From | To |
|---|---|---|---|
| 1. | K.ANTHONI RAJ | 1984 | 1987 |
| 2. | M. BHARATH KUMAR REDDY | 1987 | 10/2/2000 |
| 3. | S. UGENDER RAO | 10/2/2000 | 27/07/2002 |
| 4. | G.RAVI KIRAN REDDY | 27/07/2002 | |

గతంలో పని చేసిన డైరెక్టర్ల వివరాల సైన్ బోర్డు

### రూ.6 కోట్లతో పనులు

ప్రస్తుతం బల్దియా ప్రధాన కార్యాలయం, ఇండోర్ స్టేడియం సమీపంలో మొత్తం రూ.6 కోట్ల బల్దియా స్మార్ట్ సిటీ నిధులతో ప్లానిటోరియాన్ని పునరుద్ధరిస్తుండగా.. త్వరలోనే ఉమ్మడిఓరుగల్లుతో పాటు చుట్టుపక్కల జిల్లాల వారికి ఖగోళ విజ్ఞానాన్ని పంచబోతోంది. రూ.2కోట్ల నిధులతో భవనం పునరుద్ధరణ పనులు, డూం, సివిల్ వర్క్‌లు జరుగుతుండగా.. మరో రూ.4 కోట్లతో డిజిటల్ లైటింగ్, 3 డి స్క్రీన్, అధునాతన సౌండ్ సిస్టం, ప్రొజెక్టర్, భూగోళ పద్ధతిలో సీటింగ్ ఏర్పాటుకు టెండర్లు పిలిచినట్టు అధికారులు తెలిపారు. అయితే హైదరాబాద్‌కు చెందిన కృష్ణ ఇంజనీర్స్ అండ్ ఫాబ్రికేటర్స్ అనే సంస్థ టెండరును దక్కించుకుని పనులు చేస్తున్నట్టు బల్దియా ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు 70శాతం పనులు పూర్తయ్యాయని మరో నెల రోజుల్లో నక్షత్రశాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ తెలిపారు.

- మళ్లీ ఓరుగల్లు వాసులను అలరించనున్న ప్లానిటోరియం
- రూ.6 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో పునరుద్ధరణ పనులు
- ఇప్పటికే 70 శాతం పూర్తి.. నెల రోజుల్లో అందుబాటులోకి

### 1982లోనే నక్షత్రశాల ఏర్పాటు

దేశంలోనే వరంగల్ నగరానికి ప్రత్యేక స్థానం ఉంది. 43సంవత్సరాల క్రితమే ఇక్కడ నక్షత్రశాల ఏర్పాటైంది. 1980లో దేశంలో 12నక్షత్రశాలలు ఉండగా.. అప్పుడే ఇక్కడి నాయకులు వరంగల్ నగర ప్రజలకు సూర్యకుంటుంబంపై విజ్ఞానం కోసం ప్లానిటోరియం కావాలని ప్రతిపాదనలు చేశారు. 1982లో రూ.1.20లక్షలతో ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం వెనుక అప్పటి అవసరాలకు తగినట్టుగా నిర్మించి.. 1984లో హిందూజా ప్రతాపరుద్ర ప్లానిటోరియం పేరిట పీవీ నర్సింహరావు చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. కొద్ది పాటి రుసుము స్వీకరించి రోజుకు రెండు ప్రదర్శనలు చేసేవారు. కాగా 1984 నుంచి 1987 వరకు నక్షత్రశాల డైరెక్టర్‌గా కె.ఆంటోనిరాజ్, 1987 నుంచి 2000 వరకు ఎం.భరత్‌కుమార్‌రెడ్డి, 2000 నుంచి 2002 వరకు కె. యుగేందర్‌రావు, 2002నుంచి 2004 వరకు కె. రవికిరణ్‌రెడ్డి ఈ ప్లానిటోరియానికి డైరెక్టర్లుగా పని చేశారు. ఆ తర్వాత నక్షత్రశాలను ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోకపోవడం, నిర్వహణ లేక సామగ్రి, పరికరాలు తుప్పుపట్టి పోయాయి. భవనం శిథిలావస్థకు చేరింది. విలువైన వస్తువులు మట్టిలో కూరుకుపోయాయి. మళ్లీ ఇన్నాళ్లకు.. రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వానికి ఓకే చెప్పింది. స్మార్ట్‌సిటీ నిధులతో ప్లానిటోరియం పునరుద్ధరణకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు జరుగుతుండగా.. మరో నెల రోజుల్లో హైదరాబాద్‌కు దీటైన నక్షత్రశాల అలరించబోతోంది.

### నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

రాగి శ్రీకాంత్, బల్దియా అసిస్టెంట్ ఇంజనీర్



వరంగల్ నగరంలో ప్లానిటోరియాన్ని పురుద్ధరిస్తున్నాం. రూ.6కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో మునుపెన్నడూ లేని విధంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నాం. ఇప్పటికే పనులు 70శాతం పూర్తయ్యాయి. మిగిలిన చిన్నపాటి పనులు, స్క్రీన్, ప్రొజెక్టర్, సీటింగ్ ఏర్పాటు చేసి నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. నక్షత్రశాల ఏర్పాటుతో వల్ల ఖగోళ రహస్యాలు, వింతలు, విశేషాలను తిలకించొచ్చు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్

- ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌కు వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయం
- ఉద్యోగ సంఘాల నాయకుల్లో వణుకు
- ప్రజలు, ప్రజా సంఘాల హర్షం



వరంగల్ మెడికల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి వైద్యులు, వైద్య సిబ్బంది సరైన సమయానికి విధులకు హాజరయ్యేలా ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలను అమలు పర్చాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆర్‌సీ నెంబర్ 7711/ ప్లానింగ్ తేదీ 29/03/2005 ప్రకారం అన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆధార్ బేస్డ్ అటెండెన్స్ అమలు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపై ఆధార్ బేస్డ్ అటెండెన్స్ ద్వారానే ఉద్యోగులకు జీత భత్యాలు చెల్లించనున్నట్లు అధికారులు తేల్చి చెబుతున్నారు.

### వ్యతిరేకిస్తున్న కొందరు నేతలు

నూతన విధానాన్ని రద్దు చేయాలని కొందరు ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా లీడర్ల ముసుగులో చెలామణీ అవుతూ ఏ ఒక్కరోజు కూడా వారు విధులకు హాజు కాకుండా ప్రైవేట్ పనులు చేసుకోవడం, పైరవీలు చేసుకోవడానికి సరి పోతున్నందున ప్రభుత్వ ఉత్తర్వులు వీరికి రుచించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొందరైతే డ్యూటీలకు రాకుండా నెల నెలా జీతాలు తీసుకోవడానికి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

### పేదలకు సకాలంలో వైద్య సేవలు

ఈ విధానం వల్ల పేదలకు సకాలంలో సరైన రీతిలో వైద్య సేవలు అందుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. విధానంపై ఖమ్మం జిల్లాలో ఇప్పటికై ప్రయోగాత్మక ప్రాజెక్టుగా చేపట్టారు. సతృలితాలు ఇవ్వడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని నిర్ణయించి చర్యలు చేపడుతున్నారు.

### ప్రజలు, ప్రజా సంఘాల హర్షం

పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖలో విధులకు డుమ్మా కొట్టే వారికి చెక్ పడనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల్లో సమయపాలన పాటించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మాట.. చేటు.. వేటు..

(5వ పేజీ తరువాయి)

పంచాయతీ కార్యదర్శులను నియోజకవర్గాల వారీగా బదిలీ చేయాలనే నిర్ణయం అధికారులు తీసుకున్నారు. బదిలీలకు సంబంధించి కార్యదర్శుల నుంచి ఇప్పటికే ఆప్షన్లు తీసుకున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. అయితే ఉన్నట్టుండి తమను బదిలీ చేయాలన్న అధికారుల నిర్ణయం వెనుక కారణాలు ఏమిటో తెలియక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. అయితే బదిలీలకు తాము వ్యతిరేకులం కాదని, ఒక నియోజవకర్గం నుంచి మరో నియోజకవర్గానికి కాకుండా ఒక మండలం నుంచి మరో మండలానికి అది కూడా పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే బదిలీ చేపట్టాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఆకస్మిక బదిలీ వల్ల వీరంతా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఒకే చోట రెండేళ్ల కన్నా ఎక్కువకాలం పనిచేస్తున్న కార్యదర్శులనే బదిలీ చేసేందుకు జాబితాలను సిద్ధం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నా.. ఇందులో వాస్తవం లేదని, 8 నెలల కిందట బదిలీపై వచ్చిన వారిలో కొందరి కూడా స్థాన చలనం తప్పేట్టు కనిపించడం లేదంటున్నారు.

### మా డబ్బుల సంగతి ?

ఆకస్మికంగా తమను బదిలీ చేస్తే పంచాయతీల నిర్వహణకు తమ జేబులోంచి సొంతంగా ఖర్చుపెట్టిన డబ్బు సంగతి ఏమిటని కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసినప్పటి నుంచి తమ సొంత డబ్బుతో పాటు అప్పులు తెచ్చి అత్యవసర, అభివృద్ధి పనులకు ఖర్చుచేశామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, కార్యాలయాల నిర్వహణ వంటి పనులకు తామే సొంతంగా రూ.2 లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు చేశామని, ఆ బిల్లులన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ముందు ఆ బిల్లులను క్లియర్ చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియను చేపట్టాలంటున్నారు.

### నిబంధనలకు వ్యతిరేకం

నియోజకవర్గాలవారీగా కార్యదర్శుల బదిలీలు చట్టవిరుద్ధం. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం పంచాయతీ కార్యదర్శిని ఆయన సొంత గ్రామం మినహా



వరంగల్ కలెక్టర్ సత్యశారదకు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కేటాయించిన జిల్లా, జోన్‌లో ఎక్కడికైనా బదిలీ చేయవచ్చు. కానీ ఇందుకు భిన్నంగా మొదటిసారిగా నియోజకవర్గాల వారీగా బదిలీలు అనేది నిబంధనలకు విరుద్ధం. చట్టం, న్యాయపరంగా ఇది చెల్లదు. ఏ బదిలీ అయినా పరిపాలనా అవసరాలను బట్టి ఉంటుంది. కానీ ఉమ్మడి జిల్లాలో ఇందుకు విరుద్ధంగా నియోజకవర్గాలవారీగా కార్యదర్శులను స్థానచలనం కల్పించడం అనుమానాలకు తావిస్తోంది.

### ఎంత మంది బదిలీ ?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,680 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. బదిలీల కారణంగా వీరిలో సుమారు 600 నుంచి 750 మంది వరకు స్థాన చలనం కలగవచ్చునని తెలుస్తోంది. హనుమకొండ జిల్లాలో 100 మంది, వరంగల్ జిల్లాలో 200 మంది, జనగామ జిల్లాలో 150 మంది, మహబూబాబాద్ జిల్లాలో 200 మంది జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 100 మంది బదిలీ కానున్నట్టు తెలిసింది.

### మౌఖిక ఆదేశాలతో బదిలీ అన్యాయం



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విధి విధానాలు లేకుండా కొందరి ఒత్తిడితో ఒక నియోజకవర్గంలోని కార్యదర్శిని ఇతర నియోజకవర్గంలోనికి బదిలీ చేయాలని మౌఖికంగా ఆదేశాలు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం. ఇది అన్యాయం. పతీ కార్యదర్శి గ్రామ పంచాయతీలో రూ.2 నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు పెట్టారు. వారు పెట్టిన ఖర్చుల బిల్లులను విడుదల చేశాక బదిలీలు చేపట్టాలి. అదీ కూడా పక్క మండలంలోకే బదిలీ చేయాలి.

- ఎలికట్టె శ్రీకాంత్ గౌడ్, టీపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

### ఆందోళనలు.. వినతులు..

ఆకస్మిక బదిలీలను అడ్డుకునేందుకు కార్యదర్శులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా కలెక్టర్లును కలిసి వినతి పత్రాలను అందచేస్తున్నారు. సంబంధిత శాఖ మంత్రిని, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని, ఎమ్మెల్యేలను సైతం కలిసి బదిలీ ప్రయత్నాలను నిలిపివేయాలని కోరుతున్నారు. సోమవారం కార్యదర్శులు అయిదు జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలను అందచేశారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చుక్కల ప్రవీణ్, మహబూబాబాద్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఒడ్డెబోయిన శ్రీనివాస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగవెల్లి రంజిత్, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు, హనుమకొండ జిల్లాలో టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో టీపీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకారపు సురేష్, జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, ప్రధాన కార్యదర్శి సంతోష్ తదితరులు, వరంగల్ జిల్లాలో వరంగల్ జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ ఆధ్వర్యంలో, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్, జనగామ జిల్లాలో టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కనకం విజయకుమార్ నేతృత్వంలో కలెక్టర్లను కలిసి వినతిపత్రాలను అందచేశారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రయత్నాలను నిలిపివేయాలని, పంచాయతీల్లో వివిధ పనులకు తాము సొంతంగా ఖర్చుపెట్టిన డబ్బును వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఆదివారం ధన్వాడలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

# మూల్యాంకన విధుల్లో అవకతవకలు!

- నిబంధనలు బేఖాతరు చేస్తూ ఉత్తర్వులు
- విదేశాల్లో ఉన్న టీచర్‌కు డ్యూటీ
- మూడేళ్ల నిబంధన తుంగలోకి..
- సెకెండ్ లాంగ్వేజ్ ఉపాధ్యాయుడితో ఫస్ట్ లాంగ్వేజ్ వాల్యుయేషన్
- ప్రారంభమైన టెన్త్ స్పాట్ క్యాంపు.. 15 వరకు కొనసాగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకన విధుల్లో అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు ఉపాధ్యాయ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు బేఖాతరు చేస్తూ ఇష్టం వచ్చినట్లు విధులు కేటాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం నుంచి కాజీపేటలోని ఫాతిమా గర్ల్స్ ఎయిడెడ్ హైస్కూల్లో ప్రారంభమైన పదో తరగతి మూల్యాంకనం విధుల కేటాయింపులో అధికారుల చేసిన తప్పిదాలు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీనియారిటీని పక్కన బెట్టి జూనియర్లకు ఏఈ విధులు కేటాయించినట్లు తెలుస్తోంది. విదేశాల్లో ఉన్న ఉపాధ్యాయురాలికి మూల్యాంకన విధులు కట్టబెట్టడం అధికారుల తీరుకు పరాకాష్టగా నిలుస్తోంది. సోమవారం ప్రారంభమైన టెన్త్ స్పాట్ క్యాంపు 15 వరకు నిర్విరామంగా కొనసాగనుంది. స్పాట్ కేంద్రంలో మొత్తం 2.27 లక్షల జవాబు పత్రాలను ముదింపు చేయనున్నారు.

### నిబంధనలు బేఖాతరు

స్పాట్ విధుల కేటాయింపుల్లో అధికారులు అడ్డగోలుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. స్పాట్ నిబంధనల ప్రకారం విధులు కేటాయించాల్సి ఉండగా అందుకు భిన్నంగా విధుల కేటాయింపు జరిగినట్లు ఉపాధ్యాయ వర్గాలు విమర్శిస్తున్నాయి. పదోతరగతి జవాబు పత్రాలు ముదింపు చేయాలంటూ వరుసగా మూడేళ్లు పదోతరగతికి బోధించిన అనుభం ఉండాలి. అయితే ఈ నిబంధనను కాదని మూడేళ్ల బోధనానుభవం లేని ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులు కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో విధుల్లో ఉన్నవారికే మూల్యాంకన విధులు కేటాయించాల్సి ఉండగా సెలవుపై విదేశాల్లో ఉన్న ఉపాధ్యాయురాలికి స్పాట్ డ్యూటీ కేటాయించారు. ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగును సెకండ్ లాంగ్వేజ్ బోధిస్తున్న ఉపాధ్యాయుడికి స్పాట్ విధులు కేటాయించారు. 8 కిలోమీటర్లలోపు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్పెషల్





అసిస్టెంట్లు ఇవ్వరాదనే నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధన పాటించకుండానే విధులు కేటాయించినట్లు తెలుస్తోంది. పదేళ్లుగా పదో తరగతికి సబ్జెక్టులు బోధిస్తున్న సీనియర్లకు పార్ట్-3లో విధులు కేటాయించి జూనియర్ పంతుళ్లకు పేపర్లు ముదింపు విధులు కేటాయించినట్లు తెలుస్తోంది. అలాగే దీర్ఘకాలికంగా పదో తరగతి సబ్జెక్టులు బోధిస్తున్న కొంత మంది సీనియర్ ఉపాధ్యాయులకు ఏఈ, సీఈలుగా విధులు అప్పగించాల్సిన అధికారులు.. కేవలం పార్ట్-3, కోడింగ్ విధులను కేటాయించి జూనియర్ ఉపాధ్యాయులను ఏఈ, సీఈలుగా నియమించారు.

### అధికారుల తప్పిదాలు ఇవే...

- వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలంలోని ఉర్సు ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు) బోధిస్తున్న ఉపాధ్యాయుడికి ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు) పేపర్ మదింపు చేసే విధులు కట్టబెట్టారు.
- హనుమకొండ జిల్లా కేంద్రంలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు గత సంవత్సరం నవంబరు నెల నుంచి సెలవుపై విదేశాలకు వెళ్లారు. ఆమెకు మూల్యాంకన విధులు కేటాయించారు.
- నెక్కొండ మండలం అప్పల్‌రావ్‌పేట జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ తమ పాఠశాలలో 2022-23లో పదోతరగతి బ్యాచ్ లేనందున తమ పాఠశాల ఉపాధ్యాయులు మూడేళ్ల క్రమంగా పదో తరగతికి పాఠ్యాంశాలు బోధించలేదని డీఈవోకు లేఖ రాసినా ఆ పాఠశాలకు చెందిన కొంత మంది ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులు కేటాయించారు.
- వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి జడ్పీహెచ్ఎస్‌లో మూడేళ్ల క్రమంగా బోధించని గణితోపాధ్యాయుడికి స్పాట్ డ్యూటీ కేటాయించారు.
- వరంగల్ జిల్లా వరంగల్ ఖిలావరంగల్ మండలంలోని చింతల్ ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో సెకెండ్ లాంగ్వేజ్(తెలుగు) బోధిస్తున్న ఉపాధ్యాయుడికి ఫస్ట్ లాంగ్వేజ్‌ను మూల్యాంకనం చేసేందుకు డ్యూటీ కేటాయించారు.
- 8 కిలోమీటర్లలోపు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రమే స్పెషల్ అసిస్టెంట్లుగా విధులు కేటాయించాల్సి ఉంది. అందుకు భిన్నంగా విధులు కేటాయించి వారికి రోజుకు రూ.25 చొప్పున స్పెషల్ అలవెన్సు చెల్లిస్తున్నారు.

# కైటెక్స్‌లో 25 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్

గీసుగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేటహవేలి కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కులో 200 ఎకరాల్లో నిర్మించిన కైటెక్స్ కంపెనీలో 25 వేల ఉద్యోగాలకు ఆ కంపెనీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీర్స్, మేనేజర్స్ అసిస్టెంట్ మేనేజర్స్, స్టిచ్చింగ్, వీవింగ్ వంటి పలు విభాగాలలో పనిచేసేందుకు అర్హులైన వారిని ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నట్లు కంపెనీ యాజమాన్యం తెలిపింది. ప్రస్తుతం కంపెనీలోని పలు విభాగాలలో ట్రయల్ రన్ జరుగుతోందని యాజమాన్యం పేర్కొంది. కంపెనీ అధికారిక కైటెక్స్ గార్మెంట్స్. కామ్ సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరిచినట్లు కంపెనీ మేనేజర్ మనోజ్ తెలిపారు. కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రకటించిన నియమావళికి అనుగుణంగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ దశలలో ఎంపికలను చేయనున్నట్లు చెప్పారు.

# వడ్లు తూర్పార.. చిన్న పంకాల ముందర..

గతంలో రైతులు వడ్లు తూర్పార పట్టేందుకు సహజంగా వచ్చే గాలిపై ఆధారపడేవారు. కానీ ఇప్పుడా పరిస్థితులు మారాయి. వ్యవసాయం యాంత్రీకరణ అయింది. ఈ క్రమంలోనే వడ్లు తూర్పార పట్టేందుకు ట్రాక్టర్ ఫ్యాన్లు, ఇతర యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే కొందరు చిన్నచిన్న రైతులు ఇప్పటికీ సహజసిద్ధమైన గాలికే తమ కొద్దిపాటి భూమిలో పండిన వడ్లను తూర్పార పడుతున్నారు. కొందరు ఇదిగో ఇలా టేబుల్, స్టాండ్ ఫ్యాన్లను పెట్టుకుంటు న్నారు. సోమవారం జనగామ జిల్లా పిరకెడు గ్రామ శివార్లలో ఓ రైతు కుటుంబం గ్రామశివారులో ఇలా చిన్న పంకాల సాయంతో వడ్లను తూర్పార పడుతూ కనిపించింది.



ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ




మాట్లాడుతున్న విజయసారథిరెడ్డి

## భూముల అప్పగింతను విరమించుకోవాలి

**• సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి రెడ్డి**

గార్ల, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సెంట్రల్ యూనివర్సిటికి చెందిన భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ మండల పార్టీ కార్యాలయంలో జరిగిన అపార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, నాయకులు జంపాల వెంకన్న, కృష్ణ మూర్తి, మాగం లోకేశ్, బట్టు వీరన్న, ధరవత్ వీరన్నసింగు రమేష్, దార్ల నగేష్, పాల్గొన్నారు.




కేసముద్రం జ్యోతిరావు పూలే సెంటర్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



మానుకోట పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 24వ వార్డు పరిధిలో ఇందిరానగర్ కాలనీలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. పార్టీ పతకాన్ని పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బీజేపీ కార్యకర్త ఇంటిపై భారతీయ జనతా పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు వార్డు పరిధిలో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందీప్, గడ్డం అశోక్, దార ఇందుభారతి, వలపదాసు భద్రయ్య, శ్రీను, వినోద్‌కుమార్, ప్రేమ్‌రాయుడు, రిషి, నరేష్, రాము, నాగరాజు, శరత్, శ్రీకాంత్, ప్రేమ్‌సాగర్, సాయిచరణ్, రమేష్, వీరస్వామి పాల్గొన్నారు.

● కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పూలే సెంటర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పార్టీ జెండాను మండల అధ్యక్షుడు ఉప్పు నూతల రమేష్ ఆవిష్కరించారు. మండల కన్వీనర్ బోగోజు నాగేశ్వరాచారి అధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి వేలం శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యుడు పొదిల నర్సింహారెడ్డి, రామడుగు వెంకటాచారి, చెలగొల వెంకటేష్, గాంతి వెంకట్‌రెడ్డి, బోనగిరి ఉపేందర్, వేముల సతీష్‌రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, మల్యాల రాములు, మంగిశెట్టి నాగయ్య, మధుకర్ పాల్గొన్నారు.

**పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..**

● పెద్దవంగర (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసపూరిత పాలన కొనసాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సార్యథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల అమలులో గారెడీతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేశెట్టి వెంకటనారాయణ, అన్వేష్, పవన్, శ్యామ్, ఎర్ర ప్రకాష్ పాల్గొన్నారు.

## కోమటిపల్లి దేవాలయం సేవా సమితి ఎన్నిక



శ్రీనివాస్ అధ్యక్షుడు

ఇనుగుర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కోమటిపల్లి శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయ సేవ సమితిని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సమితి అధ్యక్షునిగా షేరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఉమ్మగాని ప్రభాకర్, కోశాధికారిగా కొట్టం యాకమూర్తి, ఉపాధ్యక్షులుగా అరెందుల మహేశ్వర్, సహాయ కార్యదర్శిగా అరిందుల సందీప్, కార్యవర్గ సభ్యులుగా మల్లం యాకయ్య, గడ్డం వెంకటేష్, అడప ప్రభాకర్, దొండ శ్రీను, చిరగోని రవీందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెళ్లి సతీష్, మాజీ సర్పంచులు నీలం యాకయ్య, రావుల మల్లేషం, మద్దెల భిక్షపతి, పూజరి కొమురయ్య, బోసుల యాకయ్య, నిమ్మల వెంకన్న, నీలం వెంకన్న పాల్గొన్నారు.

## 'చెరువుకట్ట మరమ్మతులు చేపటాలి'



ఆలేరులో రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్థులు

నెల్లికుదురు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆలేరు పెద్దచెరువు కట్టగండ్లు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ రైతులు నెల్లికుదురు మహబూబాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో భారీవర్షాలకు చెరువుకట్ట తెగిపోవడంతో చెరువలో నీళ్లలేక రైతులు సాగుకు నోచుకోవడంలేదన్నారు. చెరుకట్టతెగి ఆరునెలలు గడుస్తున్నప్పటికి పనులు చేపట్టడంలేదన్నారు. వేసవిలో పనులు పూరిచేస్తేనే వచ్చే ఖరీఫ్‌లో వరిసాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుట్ట పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూపిరెడి గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, షరీఫ్, గౌస్, కోరే శ్రీను, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తాళ్లపూసపల్లిలో కబడ్డీ పోటీలు ప్రారంభం

కేసముద్రం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూసపల్లిలో డీవైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను సోమవారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10,016 ప్రథమ బహుమతిని ఆయన అందజేయనున్నట్లు తెలిపారు. సురేష్‌గౌడ్, కొండేటి కళాధర్, గొడిశాల వెంకన్న, రాచర్ల రాములు, గొర్రె వెంకన్న, కాలేరు వెంకన్న, కందుకూరి దాసు, తీగల సునీత, మేన్పు పద్మ, వల్లాల రాజేందర్, శ్రవణ్, అనిల్, సుమన్ పాల్గొన్నారు.

## మండల ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడిగా భాస్కర్



డోర్నకల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండల ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ముద్దం భాస్కర్ ఎన్నికయ్యారు. స్థానిక జైన్‌భవన్‌లో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా గుగులోతు రవికుమార్, కోశాధికారిగా పగిడిపల్లి కొండల్‌రావులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పోటు శేఖర్, తలారి భాస్కర్, ఎండి.అజీములు వ్యవహరించారు.

## డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్



కొత్తగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడైన నెల్లుట్ల భాస్కర్‌ను నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి సోమవారం తెలిపారు. జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన భాస్కర్‌ను పలువురు అభినందించారు.

## దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కేసముద్రం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో మంజూరు చేసిన ఐదుగురు దివ్యాంగులకు ఉపకరణాలను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేసముద్రం, ఇనుగుర్తి ఎంఈవోలు కాలేరు యాదగిరి, రూపారాణి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ షేక్ ఖాదర్, ఐఈఆర్‌పీ వెంకటరమణ, ఉపెందర్, స్పెషల్ ఎస్‌జీటీ కపిల్, హెచ్‌ఎం దేవ్‌సింగ్, సీవో వెన్ను భిక్షపతి పాల్గొన్నారు.

## మార్కెట్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

**● మార్కెట్‌శాఖ డీడీఎం పద్మావతి**

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు కృషిచేస్తామని మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి వ్యాపారులకు, అధికారులకు హామీ ఇచ్చారు. మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌తో పాటు సోమవారం డీడీఎం మార్కెట్ యార్డులో మిర్చి,అపరాలను పరిశీలించిన అనంతరంవ్యాపారులు, రైతులతో మాట్లాడారు. మిర్చి వ్యాపారవర్గ ప్రతినిధులు దీపక్, విజయ్‌లు డీడీఎంతో మాట్లాడుతూ.. లారీలు లోడ్ చేసే సమయంలో లైట్లు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. యార్డులో సీసీ వర్క్‌లను పూర్తి చేయాలని, యార్డులో మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సరుకులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇందుకు డీడీఎం స్పందించి మార్కెట్‌లో సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడి యార్డులో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలు సకాలంలో జరిగి త్వరితగతిన కాంటాలు పూర్తయ్యే విధంగాచర్యలు చేపట్టాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ మార్కెట్ పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లను, మిర్చి ఖరీదులను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్‌తో పాటు దడువాయిసంఘం ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, ఉప్పలయ్య, మార్కెట్ సిబ్బంది అరుణ్ పాల్గొన్నారు.



పెసళ్ల నాణ్యతను పరిశీలిస్తున్న పద్మావతి

## గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

**కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్**

మహబూబాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వ్యయప్రయాసాల కోర్చి దూరప్రాంతాల నుంచి వచ్చి ఫిర్యాదులు అందిస్తున్నారని చెప్పారు. వారి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన తాటిపాముల వర్ధయ్య తన భార్య ఉపాధి హామీ పనులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిందని, ప్రభుత్వం నుంచి ఏదైనా ఆర్థిక సాయం అందించాలని దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. గూడూరు మండలం ఏపూరులో అక్రమంగా ఫంక్షన్‌హాల్ నిర్మించారని గ్రామానికి చెందిన బానోత్ చందు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరితో పాటు పలువురు వారి సమస్య పరిష్కారించుకునేందుకు కలెక్టర్, అధికారులకు వినతులు అందించారు. వేసవికాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో తాగునీరు సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్‌యువ వికాస పథకం కింద ఆన్‌లైన్ ప్రక్రియ నమోదు వివరాలను అధికారులు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కృష్ణవేణి, గణేష్, పురుషోత్తం, మధుసూదనరాజు, నరసింహస్వామి, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, భీమ్లానాయక్, మరియన్న, హరిప్రసాద్, విజయ, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, ధనమ్మ, వీరన్న, శ్రీమన్నారాయణరెడ్డి, రాజేశం, రజిత, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

## శిక్షణ తరగతులు నిర్వహించాలి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గిరిజన వర్కింగ్ జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించి, పత్రాలు అందించాలని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భగవాన్‌రాథోడ్ అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు సోమవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భగవాన్‌రాథోడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దళిత జర్నలిస్టులకు, మహిళ జర్నలిస్టులకు, ఇతర సామాజికవర్గాలకు శిక్షణ తరగతులు నిర్వహించి పత్రాలను అందించారని పేర్కొన్నారు. అదే తరహాలో గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించి నేటికి శిక్షణ తరగతులు నిర్వహించలేదని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడితో పాటు లావుడ్య రామునాయక్, బానోత్ లక్ష్మణ్, గుగులోతు మహేందర్, నర్సింహ, మోహన్, తాటి సుదర్శన్, తిరుపతినాయక్, బోడ రాజు, ఈసం సురేష్, శ్రీకుమార్ పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి పారిజాతం రాజేశ్వరరావు ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన వేదపండితులు నరసింహమూర్తి, దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణాచార్యులు, కౌశిక్‌శర్మ, దత్తుల వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలకు స్థానిక శాసన సభ్యులు భూక్య మురళీనాయక్-ఉమా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి శ్రీసీతారాముల కల్యాణం కనులారా వీక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పారిజాతం రాజేశ్వరరావు ట్రస్టు నిర్వాహకులు మాలె పద్మావతి-నాగేశ్వర్‌రావు, మాలె సునిత-యోగీశ్వర్‌రావు, మాలె శివకుమారి-లక్ష్మణరావు,మాలె భవాని-శ్రవణ్‌కుమార్, పసెనుగొండ కల్యాణి-సమ్మారావు, పెనుగొండ నవ్య-నలిన్‌కుమార్, గుండా నరేంద్ర దివ్యశ్రీ, అంచూరి సంతోష్-మధులిక, మాలె భారతమ్మ, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి-హేమలత దంపతులు పాల్గొన్నారు.



శ్రీసీతారాముల కల్యాణ వేడుకలో పాల్గొన్న పారిజాత రాజేశ్వరరావు ట్రస్టు బాధ్యులు

## దీప్తి జీవాంజికి సన్మానం



క్రీడాకారిణి దీప్తి జీవాంజిని సన్మానిస్తున్న దృశ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పారా ఒలంపిక్స్-2024లో బ్రాంజ్ మెడల్ సాధించిన క్రీడాకారిణి దీప్తి జీవాంజిని ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్‌లో సోమవారం ఓజ్యూవెల్లర్స్ దుకాణంఆధ్వర్యంలో దీప్తి జీవాంజికి శాలువా కప్పి, వినాయకుడి ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా శేషగాని మమతాసుధాకర్ మాట్లాడుతూ పారా ఒలంపిక్స్-2024లో భారతదేశానికి బ్రాంజ్ మెడల్ అందించిన దీప్తి జీవాంజి భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గండి వినోద పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా చరణ్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ యువజన కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరుకు చెందిన గాడిపెల్లి చరణ్ గౌడ్‌ను ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ చరణ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు, అలుపెరగని కార్యకర్తగా పనిచేస్తూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎక్కువ మొత్తంలో సభ్యత్వాలు నమోదు చేసినట్లు చెప్పారు. గతేడాది ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినట్లు చెప్పారు. ఆయన సేవలను గుర్తించి యువజన కాంగ్రెస్‌పట్టణాధ్యక్షులుగా అవకాశం కల్పించినట్లు చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డికి, రాష్ట్ర నాయకులు కంకర అయ్యప్పరెడ్డికి, ఇతర నాయకులకు చరణ్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీకాంత్ మరణం ఉద్యమానికి తీరనిలోటు

గార్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా సీపీఎం సీనియర్ నాయకుడు ఎర్ర శ్రీకాంత్ మరణం సీపీఎం ప్రజాఉద్యమానికి తీరనిలోటని సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు. తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరిగిన సీపీఎం జాతీయ మహాసభలో పాల్గొని అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కందునూరి శ్రీనివాస్, అలవాల రామకృష్ణ, వెంకటేశ్వర్లు, మల్లెల నాగమణి, బొబ్బా ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రీన్‌చానెల్ ద్వారా వేతనాలు చెల్లించాలి

కురవి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులకు గ్రీన్‌చానెల్ ద్వారా వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు పి.రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో వీరబాబుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ సిబ్బంది బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, వేతనాలకు తగిన బడ్జెట్ కేటాయించాలన్నారు. జీవో 51ని సవరించి మల్టిపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. అర్హులైన సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.రమణ, గౌస్, రామచంద్రు పాల్గొన్నారు.

## మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

కురవి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బీజేపీ హిందూ, ముస్లీం, హిందూ, క్రిస్టియన్ల నడుమ మత విద్వేషాలు రెచ్చగొడుతూ.. అల్లర్లు సృష్టిస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం ఆరోపించారు. జైబాపు... జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం గుండ్రాతిమడుగు, పెద్దతండ, కొత్తూరు(జి), తాట్యతండ, పిల్లిగుండ్లతండాల్లో సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అంబటి వీరభద్రం మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. గార్లపాటి వెంకట్‌రెడ్డి, గొల్లపల్లి రజినీకాంత్, బండి శ్రీనివాస్, బాదావత్ రామునాయక్, బండి వెంకట్‌రెడ్డి, బాలగాని శ్రీనివాస్, అవిరె మోహన్‌రావు, కోర్ని అనిల్, దయ్యాల శ్రీధర్, కిషన్ రాజ్‌పుత్, బానోత్ రమేష్, చుంచు శేఖర్ పాల్గొన్నారు.

## జార్జిరెడ్డి సభలను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా అరుణతార, మేధావి జార్జిరెడ్డి వర్ధంతి సభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనగిరి మధు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏప్రిల్ 10 నుంచి 14 వరకు జరిగే వర్ధంతి సభలను జయప్రదం చేయాలని కోరుత ముద్రించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ సర్కార్ విద్య కషాయికరణతో రోజురోజుకు విద్య దిగజారుస్తుందన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తూ గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లోని పాఠ్యాంశాల్లో సనాతన ధర్మం, రామాయణం, మహాభారతలను చేర్చారని చెప్పారు. జిల్లా కోశాధికారి మునగాల మహేష్‌కుమార్, నాయకులు విజయ్, సున్నత్, విప్లవ్, వినయ్, జస్వంత్ పాల్గొన్నారు.

## మారెమ్మ తల్లి ఊరేగింపు

మరిపెడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మాకుల వేంకటేశ్వరుడి ఆలయ సన్నిధిలో నిర్మితమైన నూతన ఆలయంలో బుధవారం మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠోత్సవం సందర్భంగా ఆ ఆలయ నిర్వాహకులు సోమవారం మారెమ్మ తల్లి విగ్రహాన్ని మరిపెడ విలేజీలోని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటా భక్తులు బిందెలతో నీళ్ల అరపోసి మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## బడిబాగు కోసం కదిలిన ఉపాధ్యాయులు

**● పంతుళ్ల సహాయంతో సామగ్రి కొనుగోలు**



క్రీడాసామగ్రిని అందజేస్తున్న కాంగ్రెస్ నేత నారాయణరెడ్డి

కొత్తగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సాదిరెడ్డిపల్లి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాగు కోసం విద్యార్థులను ఆకర్షించేందుకు ఆర్థిక సహాయం చేసి పలు క్రీడా సామగ్రి, సౌండ్ సిస్టంను సోమవారం కొనుగోలు చేశారు. ఈ పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు విద్యార్థులను ఆకర్శించేందుకు ఉపాధ్యాయులు రూ.40వేలు వెచ్చించగా పాఠశాలలోని కొన్ని చెట్లను విక్రయించగా రూ.60వేలు వెరసి రూ.లక్ష జమ అయ్యాయి. ఈ డబ్బులతో క్రీడా సామగ్రి, సౌండ్, బ్యాండు వస్తువులను కొనుగోలు చేయడమేకాకుండాల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించేందుకు మంత్రి సీతక్క సహకారంతో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం కల్తీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పూల్‌సింగ్, శ్రీనివాసరావు, రవికుమార్, హరినాద్, సదర్, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, లింగయ్య, కృష్ణ పాల్గొన్నారు.

## అందరి వారు బీఆర్ అంబేద్కర్

**రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్.సురేందర్‌రెడ్డి**

మరిపెడ, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): అందరి వారు బీఆర్.అంబేద్కరుడని మాజీ ఎంపీకాంగ్రెస్ సీనియర్ నేత ఆర్.సురేందర్‌రెడ్డి అన్నారు. తానంచర్ల గ్రామంలో దివంగత నేత ఆర్.రంగారెడ్డి చేయూతతో అక్కడి దళితులు ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించి, రామసహాయం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి, నరేష్‌రెడ్డి మృతి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటేనని పేర్కొన్నారు. నూకల అభినవ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాంలాల్, తెర ప్రభాకర్ రెడ్డి, విసారపు శ్రీపాల్‌రెడ్డి, సీత వెంకన్న, సీత భద్రయ్య, అంజి, గణేశ్, నాగరాజు, ప్రవీణ్, అశోక్, పాశం నరేశ్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

## మహిమాన్వితుడు.. మాకుల వేంకటేశ్వరుడు

(5వ పేజీ తరువాయి)

రెండు కిలోమీటర్లు, మరిపెడ సూర్యాపేట హైవేకు కిలోమీటన్నర దూరంలో మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కేంద్రాల నుంచి నిత్యం మరిపెడబంగ్లాకు అనేక బస్సు సర్వీసులు ఉంటాయి. ఈ జాతర ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ఇప్పటికే పూర్తి చేశారు.

### భక్తులకు ఇబ్బందులు కలుగనివ్వం



**ఈవో వేణుగోపాల్**

మరిపెడ మాకుల వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనివ్వం. వసతి సౌకర్యంతో పాటు తాగునీరు సౌకర్యం కలిపిస్తున్నాం. మహిళల కోసం తాత్కాలిక స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నాం. చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నాం. మీ భద్రత మా బాధ్యతగా గుర్తిస్తాం.

### బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



**జగన్నాథాచార్యులు, చైర్మన్, ఎన్‌సీహెచ్**

మరిపెడ మాకుల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. నిత్య పూజలు జరిపి భక్తుల దైవ దర్శనం కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నాం. భక్తులు సమర్పించే కానుకలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.